సాక్షి
విజయనగరం

బుధవారం। 13। ఆగస్టు। 2025

బురద నీరు.. ఇదే తాగునీరు..

సంతకవిటి మండలంలోని జావాం వద్ద ఉన్న సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా పథకం నుంచి రెండు రోజులుగా బురద నీరు సరఫరా అవుతోంది. తాగునీటికి పలు గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కుళాయిల ద్వారా స్వచ్ఛమైన నీరు సరఫరా అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– సంతకవిటి





బాలలతో పనిచేయించడం నేరం

విజయనగరం అర్బన్: సముద్రపు ఉత్పత్తుల ప్రాసెసింగ్ ప్లాంట్స్, కోల్డ్‌స్టోరేజీలలో బాలలతో పనిచేయించడం నేరమని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. బాలకార్మిక చట్టం అమలుకోసం జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్స్‌కమిటీని నియమించినట్టు తెలిపారు. కమిటీలో కలెక్టర్ చైర్మన్‌గా, కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ నోడల్ అధికారిగా, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్, మత్స్య శాఖ డీడీ, కాలుష్య నియంత్రణ మండలి ఈఈలు సభ్యులుగా ఉంటారన్నారు. జిల్లాలో ఉన్న 13 హేచరీలను తనిఖీ చేసి నివేదిక అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు.

న్యూస్‌రీల్

నులిపురుగుల నివారణతో పిల్లలకు ఆరోగ్యం

- కలెక్టర్ అంబేడ్కర్



విద్యార్థికి అల్బెండజోల్ మాత్ర వేస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

గంట్యాడ: పిల్లల్లో నులిపురుగుల నివారణతో ఆరోగ్యం సిద్ధిస్తుందని, పోషకాహారలోపం తొలగి ఆరోగ్యంగా పెరుగుతారని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. ఏడాది నుంచి 19 ఏళ్ల వయస్సు మధ్యన ఉన్న పిల్లలు, విద్యార్థులందరితో అల్బెండజోల్ మాత్రలు మింగించాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు సూచించారు. డీ వార్మింగ్ డే సందర్భంగా గంట్యాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడుపులోని నులిపురుగుల నివారణకు ప్రతీ ఒక్కరూ ఆల్బెండజోల్ మాత్రను ఒకే డోస్‌గా వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.జీవనరాణి, డీఈఓ మాణిక్యంనాయుడు, ఆర్‌బీఎస్‌కే కో ఆర్డినేటర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ నీలకంఠేశ్వర రెడ్డి, డాక్టర్ హేమలత, పాఠశాల హెచ్‌ఎం ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత

విజయనగరం లీగల్: వచ్చేనెల 13వ తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం నేషనల్ ఇన్సూరెన్స్, బజాజ్ జనరల్ ఇన్సూరెన్స్, శ్రీరామ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీల మేనేజర్లు, ఇన్సూరెన్స్ కంపెనీ న్యాయవాదులతో ప్రీ సిట్టింగ్ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా 12 ప్రమాద బీమా క్లైమ్ కేసులు రాజీకి వచ్చినట్లు ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. కార్యక్రమంలో ఫ్యామిలీ కోర్టు జడ్జి కె.విజయ కల్యాణి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణ ప్రసాద్, ఇన్సూరెన్స్ కంపెనీ అధికారులు పాల్గొన్నారు.

పాత మార్కొండపుట్టిలో గజరాజులు



పాతమార్కొండ పుట్టిలో పత్తి పంటలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

కొమరాడ: తోటపల్లి ముంపు ప్రాంతమైన పాత మార్కొండపుట్టి గ్రామ పరిసరాల్లో మంగళవారం ఏనుగులు సంచరించాయి. వరి, పత్తి, కూరగాయలు, అరటి పంటలను నష్టపరుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏనుగుల తరలింపునకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పేదల బియ్యంతో.. వ్యాపారం భళా..!



చిత్రంలో ఆటోలో తరలిస్తుండగా అధికారులకు పట్టుబడినవి పేదల బియ్యం. జామి మండలం భీమసింగిలో జూన్ నెలలో పట్టుబడ్డాయి. భీమసింగి గ్రామానికి చెందిన వాకచర్ల నరేష్ ఆటోలో 856 కేజీల బియ్యాన్ని తరలిస్తుండగా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సింహాచలం, సీఎస్‌డీటీ మూర్తి పట్టుకుని సీజ్‌చేశారు.

'బొండపల్లి మండలం కొండకిండాంలోని కోళ్ల ఫారంలో 106 క్వింటాళ్లు, కిండాం అగ్రహారం మామిడితోటలో 43 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను జూలై 5వ తేదీన అధికారులు సీజ్ చేశారు. ఇక్కడ ప్రభుత్వం సరఫరా చేసిన సంచులతోనే బియ్యం పట్టుబడడం గమనార్హం.'

'ఈనెల 10వ తేదీన జామి మండలం అన్నంరాజుపేటకు చెందిన కోరాడ చంద్రశేఖర్ అనే వ్యక్తి బొలెరో వాహనంలో 2400 కేజీలు (48 బస్తాలు) పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా కొండతామరపల్లి కూడలి వద్ద గంట్యాడ పోలీసులు పట్టుకున్నారు. బియ్యాన్ని, వాహనాన్ని సీజ్ చేశారు.'



గంట్యాడ మండలం కొండతామరపల్లి వద్ద బొలెరో వాహనంలో తరలిస్తుండగా పట్టుబడిన పీడీఎస్ బియ్యం (ఫైల్)

- పీడీఎస్ బియ్యం పక్కదారి
- నేరుగా మిల్లులకు తరలింపు
- మరోసారి మరపట్టించి మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయం
- అధిక లాభాలు వస్తుండడంతో జోరందుకున్న వ్యాపారం
- బియ్యం దారిమళ్లించేవారికి నేతల అండదండలు

విజయనగరం ఫోర్ట్:

రేషన్ దుకాణాలకు ప్రభుత్వం సరఫరా చేసిన పేదల బియ్యం పెద్దఎత్తున పక్కదారి పడుతున్నాయి. అవే బియ్యాన్ని నేరుగా మిల్లులకు తరలిస్తున్నారు. వాటిని మరోసారి మరపట్టించి జిల్లాతో పాటు పొరుగు జిల్లాల్లోని మార్కెట్‌లలో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. కొందరు మిల్లర్లు తిరిగి సివిల్‌సప్లయి గోదాంలకు తరలిస్తున్నారు. వ్యాపారం లాభసాటిగా మారడంతో పేదల నుంచి బియ్యం సేకరణకు వందలాది మంది వ్యాపారుల అవతారం ఎత్తుతున్నారు. కొన్నిచోట్ల 'అధికార' బలంతో నేరుగా రేషన్ డిపోల నుంచే బియ్యం తరలిస్తున్నట్టు తనిఖీల్లో వెలుగుచూస్తుండడం అధికార వర్గాలనే విస్మయానికి గురిచేస్తోంది. సివిల్‌సప్లయి అధికారులు కొన్నిచోట్ల తనిఖీలు చేస్తున్నా పీడీఎస్ బియ్యం తరలింపు ఆగడంలేదు. ప్రతీ నెల 15వ తేదీ వరకు బియ్యం తరలింపు జోరుగా సాగుతోంది. కొన్నిచోట్ల డీలర్లు, అధికారుల సహకారంతో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. బియ్యం వ్యాపారులు ప్రతినెలా కమీషన్ల రూపంలో ముట్టజెప్పడం వల్లే బియ్యం పక్కదారి పట్టిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

చర్యలు తీసుకుంటాం..



కొద్ది రోజుల కిందటే విధుల్లో చేరాను. పీడీఎస్ బియ్యాన్ని పక్కదారి పట్టించకూడదు. సీఎస్‌డీటీలతో ఆకస్మిక తనిఖీలు చేయిస్తాం. పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకుంటాం. ఎవరైనా పీడీఎస్ బియ్యంను పక్కదారి పట్టిస్తే అటువంటి వారిపై 6–ఏ కేసులు నమోదుచేసి జాయింట్ కలెక్టర్ కోర్టులో హాజరుపరుస్తాం.

– మురళీనాథ్, జిల్లా పౌరసరఫరాల అధికారి

కేసుల నమోదు ఇలా...

2024 సంవత్సరంలో పీడీఎస్ బియ్యం తరలించిన 90 మందిపై 6–ఏ కేసులు నమోదయ్యాయి. 1959 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్‌చేశారు. ఈ ఏడాది 26 మందిపై 6–ఏ కేసులు నమోదయ్యాయి. 281.44 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్‌చేశారు.

గతేడాది నమోదైన కేసులు, సీజ్ చేసిన బియ్యం..


నెల	కేసుల సంఖ్య	పట్టుకున్న బియ్యం (క్వింటాళ్లలో)
జనవరి	3	14.50
ఫిబ్రవరి	9	129.81
మార్చి	14	107.35
ఏప్రిల్	10	53.07
మే	5	55.45
జూన్	5	49.89
జూలై	3	101.26
ఆగస్టు	17	668.05
సెప్టెంబర్	3	193.69
అక్టోబర్	6	174.60
నవంబర్	7	236.30
డిసెంబర్	8	175.2

450 కేజీల పీడీఎస్ బియ్యం పట్టివేత



టాటా ఏస్ వాహనంలో లోడ్ చేసిన ప్రజాపంపిణీ బియ్యం

లక్కవరపుకోట: మండల కేంద్రం నుంచి అక్రమంగా తరలిస్తున్న ప్రజాపంపిణీకి చెందిన 450 కేజీల బియ్యాన్ని ఎస్సై సీహెచ్.నవీన్‌పడాల్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం దాడి చేసి పట్టుకున్నారు. మండల కేంద్రానికి ఎందిన కొట్యాడ బుజ్జి తన షాపు నుంచి గంట్యాడ మండలంలోని వసంత గ్రామానికి చెందిన గూనూరు కాశీకి ఈ బియ్యం అమ్మి వాహనంలో లోడ్ చేసి పంపించే క్రమంలో పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ రమేష్ ఆధ్వర్యంలో బియ్యాన్ని తూచి కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.



బియ్యం వ్యాపారులకు నేతల అండ

బియ్యం వ్యాపారులకు అధికార పార్టీ నేతలు అండదండలందిస్తున్నట్టు సమాచారం. ఎక్కడైనా పీడీఎస్ బియ్యాన్ని అధికారులు పట్టుకుంటే వారికి అధికార పార్టీ నేతలు ఫోన్‌చేసి మా వాడే వదిలేయండంటూ మౌఖిక ఆదేశాలు జారీ చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. దీనికోసం బియ్యం వ్యాపారులు ప్రతినెలా నేతలకు కొంత మొత్తాన్ని ముట్టజెబుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకే అధికారులు కూడా కిమ్మనడంలేదని తెలిసింది. బొండపల్లి మండలంలో ప్రభుత్వం సరఫరా చేసిన గోనెలతోనే రేషన్ షాపు నుంచి నేరుగా పీడీఎస్ బియ్యం తరలించినా సంబంధిత డీలర్‌పై ఇప్పటికి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. దీనివెనుక అధికార పార్టీకి చెందిన ఓ ప్రజా ప్రతినిధి బంధువు అధికారులపై ఒత్తిడి తెచ్చినట్టు తెలుస్తోంది.

ఎరువుల బాధ్యత ఏఓలదే

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం రూరల్: జిల్లాలో ఎరువుల కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత వ్యవసాయ శాఖాధికారులపై ఉందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ స్పష్టం చేశారు. జిల్లాలో అవసరమైన పరిమాణంలో ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు.

మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎరువుల పర్యవేక్షణపై జాయింట్ కలెక్టర్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల కొరతపై ఎలాంటి ఆందోళన అవసరం లేదన్న విషయం రైతులకు వివరించాలన్నారు. మండలాల వారీగా అధికారులు పర్యవేక్షించిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎరువుల దుకాణాలపై పటిష్ఠ పర్యవేక్షణ ఉండాలని, కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు విక్రయించిన చర్యలు తీసుకుని అవసరమైతే సీజ్‌చేయాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, వ్యవసాయ శాఖాధికారులు పాల్గొన్నారు.

గురజాడ ఇంటిలో తాగుబోతు హల్‌చల్

- కోటవెనుక గోడ ఎక్కి మహాకవి ఇంట్లోకి చొరబడిన దొంగ
- పుస్తకాలను విసిరేసిన వైనం
- ఆవేదనలో సాహితీవేత్తలు



తాగుబోతు గురజాడ ఇంటి గోడ బయటకు విసిరేసిన సాహిత్య పుస్తకాలు



గురజాడ ఇంటి గోడపక్కనే మత్తులోకి జారుకున్న దొంగ



మహాకవి ఇంట్లోని పుస్తకాల బీరువా తెరిచిన దృశ్యం

విజయనగరం టౌన్: విచ్చలవిడిగా దొరుకుతున్న మద్యం సేవించి.. ఆ మత్తులో మహాకవి గురజాడ ఇంటిలోకి కోట వెనుక భాగం నుంచి ఓ దొంగ మంగళవారం వేకువజామున చొరబడ్డాడు. మహాకవి రచనలు తప్పితే అక్కడ ఏమీ కనిపించకపోయే సరికి... ఆ పుస్తకాల విలువ తెలియని తాగుబోతు వాటిని గోడమీదనుంచి బయటకు విసిరేశాడు. చిందరవందర చేశాడు. మద్యం మత్తులో తూగుతూ గోడపై నుంచి దూకేసి అక్కడే మత్తులోకి జారుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

మహాకవి రచనలకు భద్రత కరువు?

మహాకవి గురజాడ రచనలను భద్రం చేయాల్సిన ఆర్కియాలజీ విభాగం, జిల్లా అధికార యంత్రాంగం ఎటువంటి చర్యలు చేపట్టలేదు. మహాకవి ఇంటిని పరిరక్షణ చేయమని, పక్కన ఉన్న ఖాళీ స్థలం వల్ల స్మారకభవనానికి ఇబ్బందులు వస్తున్నాయని, అధికారులకు పలుమార్లు వినతులు అందజేసినా ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. తాజా ఘటనతో మహాకవి అభిమానులు, సాహితీ సంఘాల ప్రతినిధులు ఆవేదన చెందుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి మహాకవి రచనలకు భద్రత కల్పించాలని కోరుతున్నారు.

మహాకవి.. మా పాలకులను మన్నించుమా...



గురజాడ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

విజయనగరం గంటస్తంభం: తెలుగు జాతికి తన రచనలతో వెలుగు దారి చూపిన మహోన్నత వ్యక్తి, కన్యాశుల్కం నాటక రచయిత, మహాకవి గురజాడ అప్పారావు గృహానికి, ఆయన సాహిత్య సంపదను కాపాడడంలో పాలకులు విఫలమయ్యారని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి ఆరోపించారు. ఒక తాగుబోతు గురజాడ అప్పారావు గృహంలోకి చొరబడి అక్కడి ఫ్యాన్లు, విలువైన పుస్తకాలు, వస్తువులు చిందరవందర చేసిన విషయం తెలుసుకుని పౌర వేదిక సభ్యులతో కలిసి గురజాడ గృహాన్ని మంగళవారం సందర్శించారు. గురజాడ ఇందిర, ప్రసాద్‌లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గురజాడ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ గురజాడ జయంతి, వర్ధంతి సభల్లో అధికారులు, నాయకులు ఊదరగొట్టే ప్రసంగాలు చేస్తూ వెంటనే మర్చిపోతున్నారన్నారు. గురజాడ గృహం పరిసరాలను ఉచ్చలదొడ్డి మాదిరిగా తయారుచేశారన్నారు. అపరిశుభ్రతలో భవనం ఉన్నా పట్టించుకునేవారే కరవయ్యారన్నారు. మద్యం మత్తులో ఓ దొంగ ఇంటిలో చొరబడి, విలువైన పుస్తకాలను గోడబయటకు విసిరేయడాన్ని చూస్తే భద్రతలోని డొల్లతనం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. భవన నిర్వహణ బాధ్యతను విజయనగరం కార్పొరేషన్, జిల్లా టూరిజం, పురావస్తు శాఖ అధికారులు తీసుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. గురజాడ అభిమానులు దేశవ్యాప్తంగా ఉన్నారని, ఇక్కడ జరుగుతున్న పరిణామాలు చూసి వారంతా ఆవేదన చెందుతున్నారన్నారు. గురజాడ గౌరవం కాపాడే దిశగా మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పౌర వేదిక సభ్యులు ప్రభాకరరావు, రామచంద్ర రాజు, రామ్మోహన్ రావు, పద్మావతి, కనకాచారి, గోపి పాల్గొన్నారు.

పస్తులతో హాస్టల్ విద్యార్థుల నిరసన



భోజనం చేయకుండా హాస్టల్‌లో నిరసన తెలుపుతున్న ఎస్.కోట గిరిజన సంక్షేమ వసతి గృహం విద్యార్థులు

శృంగవరపుకోట: భోజనం బాగులేదంటూ ఎస్.కోట పట్టణం పుణ్యగిరి రోడ్డులో ఉన్న గిరిజన బాలుర సంక్షేమ వసతి గృహం విద్యార్థులు మంగళవారం ఆందోళన చేశారు. పస్తులతో ఉంటూ నిరసన తెలిపారు. చాలా రోజులుగా హాస్టల్‌లో మెనూ పాటించడం లేదని, భోజనం తినలేకపోతున్నామని వాపోయారు. ఒక్క ఫ్యాన్‌కూడా లేకపోవడంతో దోమలతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై విజయనగరంలో ఉన్న ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయకార్యదర్శి రమేష్, నాయకులు మహేష్, చైతన్య స్పందించారు. భోజనం బాగులేదని చెప్పిన విద్యార్థులపై వార్డెన్ సత్యనారాయణ బెదిరింపులకు దిగుతున్నారని, తక్షణమే ఆయనను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆందోళన అంశాన్ని వార్డెన్ వద్ద ప్రస్తావింగా ఇటీవల కురిసిన పిడుగుల వానకు ఫ్యాన్లు పాడయ్యాయని, రెండు రోజుల్లో బాగుచేయిస్తామని చెప్పారు.

బొబ్బిలిలో రెడ్‌బుక్ రాజ్యాంగం!

- పెట్రోల్ బంక్ నిర్వహించనీయకుండా బెదిరింపులు
- బంకులోకి వాహనాలు రాకుండా అడ్డుగా పెడుతున్న లారీలు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నిర్వాహకుడు
- డీఎస్ఓను విచారణకు ఆదేశించిన కలెక్టర్



పెట్రోల్‌బంక్‌కు అడ్డంగా పెట్టిన లారీ



పెట్రోల్ బంక్‌లో విచారణ జరుపుతున్న జిల్లా పౌరసరఫరాల అధికారి మురళీనాథ్, తదితరులు

బొబ్బిలి: ఇప్పుడున్నది మా ప్రభుత్వం.. నడుస్తున్నది రెడ్‌బుక్ రాజ్యాంగం.. ఇక్కడ బంకును మేమే నిర్వహిస్తాం.. తక్షణమే ఖాళీచేసి వెళ్లిపో.. లేదంటే లారీలను అడ్డుగా పెడుతాం.. బంకులోకి వాహనాలు రాకుండా అడ్డుకుంటాం.. వ్యాపారమే సాగనీయం... ఇదీ బొబ్బిలి పట్టణంలోని పాత కోర్టు జంక్షన్‌లోని హెచ్‌పీ పెట్రోల్‌బంకు నిర్వాహకునికి స్థానిక నేతల నుంచి ఎదురైన బెదిరింపులు. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని లొకర్నో ఏజెన్సీకి ఉన్న స్థలంలో హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసింది. స్థల యజమాని మృతి చెందారు. తదనంతరం కంపెనీకి సమర్పించాల్సిన డాక్యుమెంట్ల విషయంలో ఉన్న సమస్యల కారణంగా స్థల యజమానికి కంపెనీ ఏళ్ల తరబడి అద్దె చెల్లింపు పెండింగ్‌లో పెట్టింది. పెట్రోల్ బంక్ లైసెన్సుదారు, సామర్లకోటకు చెందిన దళితుడైన చక్రవర్తి ఇక్కడ బంకును నిర్వహిస్తున్నారు. వ్యాపారం ఆపేయాలని స్థానిక నేతల నుంచి ఆయనకు హెచ్చరికలు వచ్చాయి. లైసెన్సు తమకు వదిలేయాలని, నిర్వహణ చూసుకుంటామంటూ బెదిరించారు. ఎమ్మెల్యేను కలవాలంటూ ఆదేశాలిచ్చారు. చేసేదిలేక ఆయన స్థానికంగా బంకులు నిర్వహిస్తున్న విజయ్, రెడ్డిల సహాయం అర్థించారు. వారి సూచనలతో ఎమ్మెల్యేకు సమస్య చెప్పేందుకు వెళ్లగా కొందరు నాయకులు కలవనీయలేదు. బంక్‌కు లారీని అడ్డం పెట్టడంతో వ్యాపారం తగ్గిపోయింది. పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు భయపడి విజయనగరం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ అంబేడ్కర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ డీఎస్ఓ మురళీనాథ్‌ను విచారణకు ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక పౌరసరఫరాల ఉపతహసీల్దార్ రెడ్డి సాయికృష్ణతో కలిసి పెట్రోల్ బంక్‌కు వెళ్లి విచారణ జరిపారు. లైసెన్సు ఎంత వరకూ ఉంది. స్థల లైసెన్సు, బంక్ నిర్వాహణకు సమయం ఎంత అనే కోణంలో విచారణ చేశారు. బంకుకు అడ్డంగా పెట్టిన లారీలను పరిశీలించారు. ఈ విషయమై మురళీనాథ్‌ను ప్రశ్నించగా కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణకు వచ్చాననీ, ఇక్కడి పరిస్థితులపై కలెక్టర్‌కు నివేదిక అందజేస్తానన్నారు.